
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

5



వనపర్తి

జిల్లా వార్తలు

ఆదివారం 11 మే 2025

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 38.0 । కనిష్ఠం : 26.0

దొంగలతో జాగ్రత్త : ఎస్పీ


పెబ్బేరు, మే 10 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు రావడంతో చాలా మంది తీర్థ యాత్రలు, ఊళ్లకు వెళ్లేవారు జాగ్రత్తలు పాటించాలని వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్ సూచించారు. శనివారం పెబ్బేరు పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న వాహనాల స్థితిగతులను ఎస్సైని అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ఉన్నారు.




సోమశిల వద్ద మైదాన ప్రాంతంగా మారిన కృష్ణానది



వరద జలాలు తగ్గుముఖం పట్టడంతో సోమశిల వద్ద అడుగంటిన కృష్ణానది



సోమశిల వద్ద కృష్ణానది ముంపు భూముల్లో రైతులు సాగు చేసిన నువ్వుల పంట



కృష్ణానది ఒడ్డున నిలిచిన ఏపీ లాంచి

నాడు కళకళ.. నేడు వెలవెల

- అడుగంటిన కృష్ణానది - ఒడ్డుకు చేరిన మరబోట్లు - నిలిచిన సోమశిల-శ్రీశైలం లాంచి ప్రయాణం

వానకాలంలో కళకళలాడే కృష్ణానది నేడు వెలవెలబోతుంది. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం సోమశిల గ్రామం కృష్ణానది అందాలకు, ప్రాచీన ఆలయాలకు ప్రసిద్ధి. ఈ ప్రాంతాన్ని సందర్శించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి పర్యాటకులు శని, ఆదివారాల్లో అధిక సంఖ్యలో వస్తుంటారు. ఈ వేసవి ప్రారంభం నుంచి జలాలు అడుగంటి పోవడంతో కృష్ణానది మైదాన ప్రాంతంగా మారిపోయింది. దీంతో ముంపు భూముల్లో రైతులు వ్యవసాయం చేసుకుంటున్నారు. సోమశిల గ్రామాన్ని సందర్శించే పర్యాటకులు ఇతర ప్రాంతాల భక్తులు కృష్ణానది అవతలి ఒడ్డున ఆంధ్ర సరిహద్దులో ఉన్న సప్తనదుల సంగమ క్షేత్రం సంగమేశ్వర ఆలయాన్ని దర్శించుకుంటూ మొక్కులు చెల్లించుకుంటున్నారు. కృష్ణానది అడుగంటి పోవడంతో సోమశిల కృష్ణానది మీదుగా శ్రీశైలం వరకు తెలంగాణ టూరిజం ఆధ్వర్యంలో నడిపే లాంచి ప్రయాణం కొన్ని రోజులుగా నిలిచిపోయింది.

- కొల్లాపూర్, ఆంధ్రజ్యోతి



సోమశిల వద్ద కృష్ణానది ఒడ్డుకు చేరిన మరబోట్లు

రైతులను ఇబ్బందులకు గురి చేయడం సరికాదు

6

- ధాన్యం కొనుగోలు చేయడంలేదని గోపాల్‌పేటలో రైతుల రాస్తారోకో



పాలమూరు జనరల్ ఆసుపత్రిలోని మాతా శిశు సంరక్షణ విభాగం

డిప్యుటేషన్ల పర్వం

» పాలమూరు ఆసుపత్రి అంటే అంత అలుసు!

- » ఎక్కడ పోస్టులు తక్కువున్నా జనరల్ ఆసుపత్రి నుంచే..
- » ఇప్పటికే డిప్యుటేషన్‌పై ఫార్మసిస్టులు, ల్యాబ్‌టెక్నీషియన్లు
- » గైనకాలజిస్టులను పంపించాలని డీఎంఈ ఉత్తర్వులు
- » గట్టిగా మాట్లాడలేకపోతున్న ప్రజాప్రతినిధులు, డైరెక్టర్, సూపరింటెండెంట్లు
- » ఇబ్బంది పడుతున్న డాక్టర్లు, పారామెడికల్ సిబ్బంది

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం), మే 10 (ఆంధ్రజ్యోతి): పాలమూరు జనరల్ ఆసుపత్రి అంటే రాష్ట్ర ఉన్నతాధికారులకు సైతం లోకువే అన్నట్లు కనిపిస్తోంది. ఏ ఆసుపత్రిలో పోస్టులు తక్కువగా ఉన్నా పాలమూరు జనరల్ ఆసుపత్రి నుంచి డిప్యుటేషన్ తీసుకోవడం ఆనవాయితీగా మారింది. ఇప్పటికే ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులను పక్క జిల్లాలకు డిప్యుటేషన్‌పై పంపించారు. తాజాగా డాక్టర్లను కూడా పక్క జిల్లాకు డిప్యుటేషన్‌పై పంపించాలని ఉత్తర్వులు ఇవ్వడం చూస్తే పాలమూరు అంటే అలుసైపోయినట్లు అనిపిస్తోంది. తమకే సిబ్బంది తక్కువగా ఉన్నారని, డిప్యుటేషన్‌పై పంపిస్తే తమకు ఇబ్బందులు వస్తాయని గట్టిగా మాట్లాడ లేని స్థితిలో వైద్య కళాశాల డైరెక్టర్, ఆసుపత్రి సూపరింటెండెంట్‌లు ఉండిపోయారు. దీంతో మానసికంగా, కుటుంబ పరంగా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఏ ఒక్క ప్రజా ప్రతినిధి గానీ, జిల్లా ఉన్నతాధికారులు గానీ వ్యతిరేకించకపోవడం గమనార్హం.

● జనరల్ ఆసుపత్రి నుంచే డిప్యుటేషన్...

నారాయణపేట జిల్లాలోని జనరల్ ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, తమకు ముగ్గురు నుంచి ఐదుగురిని డిప్యుటేషన్‌పై వేయాలని ఆసుపత్రి అధికారులు డీఎంఈని కోరారు. ఆ వెంటనే మహబూబ్‌నగర్ జనరల్ ఆసుపత్రి నుంచి నలుగురు ల్యాబ్ టెక్నీషియన్లను షిఫ్టుల వారీగా, వారంలో రెండు రోజులు వెళ్లి పనిచేసే విధంగా డిప్యుటేషన్

- మిగతా 6లో..

తవ్వేకొద్దీ.. అక్రమాలే..

- » ఇప్పటికే మిల్లుకు చేరిన 663 సంచులు
- » మరో పెద్దలాట్ విక్రయానికి రంగం సిద్ధం
- » తేరుకున్న అధికారులు.. ట్రక్ షీట్ నిలుపుదల



రేకులపల్లి కొనుగోలు కేంద్రంలో విచారణ కొనసాగుతున్న ధాన్యం

గద్వాల, మే 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు మద్దతు ధరతోపాటు క్వింటాలుకు రూ. 500 బోనస్ ప్రకటించింది. వానకాలంలో కొనుగోలు చేసిన ధాన్యానికి బోనస్ చెల్లించడంతో రైతులు సంతోషంగా ఉన్నారు. అదేవిధంగా అక్రమార్కుల కన్ను బోనస్ మీద పడింది. యాసంగిలో కూడా సన్న రకం ధాన్యాన్ని పండించడంతో ఇదే అదునుగా బావించి మార్కెట్‌లో కొనుగోలు చేసిన ధాన్యం, రైస్ మిల్లులో గత వానకాలంలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేంద్రాలకు తరలించి పెద్దఎత్తున అక్రమాలకు తెరలేపుతున్నారు. కొత్తపల్లి కేంద్రంలో దాదాపు 800 సంచుల ధాన్యాన్ని అధికారులు గుర్తించారు. 'సరిహద్దులో బోనస్ దందా' శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కావడంతో మరికొన్ని ఘటనలు బయటపడుతున్నాయి.

మిల్లుకు చేరిన 663 సంచుల ధాన్యం

గద్వాల మండలం కొత్తపల్లి కొనుగోలు కేంద్రానికి ఈ నెల 1వ తేదీన రేకులపల్లికి చెందిన ఓ రైతు మార్కెట్‌లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని తీసుకు వచ్చారు. కొత్తపల్లిలో తన బంధువు నారాయణరెడ్డి పేరుపై 663 సంచుల ధాన్యం విక్రయించాడు. వాస్తవానికి నారాయణరెడ్డికి గ్రామంలో 18 ఎకరాలకు పైగా భూమి ఉంది. ఆయన దానిని నలుగురు రైతులకు కౌలుకు ఇచ్చాడు. వ్యవసాయం చేయలేదు. కానీ గుంటిపల్లికి చెందిన వ్యక్తి ఆయన పేరుపై గద్వాలలో తీసుకవచ్చిన ధాన్యాన్ని విక్రయించాడు. ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంతో ఐకేపీ, రెవెన్యూ, వ్యవసాయ విస్తరణ అధికారులు విచారణ చేయడంతో ఇది బయటపడింది. ఇప్పటికే ధాన్యం 8వ తేదీన అలంపూర్‌లోని ఓ మిల్లుకు చేరింది. అధికారులు ఈ ధాన్యానికి చెల్లింపులు నిలుపుదల చేయనున్నారు.

రేకులపల్లిలో ఇదేదందా..

కొత్తపల్లి కేంద్రంలో అనుమానం రాకుండా విక్రయాలు చేయడంతో ఇదే రైతు రేకులపల్లి కొనుగోలు కేంద్రంలో కూడా ఇదేదందాను కొనసాగించినట్లు అనుమానం రావడంతో అధికారులు విచారణ మొదలు పెట్టారు. ఆయన తీసుకవచ్చిన ధాన్యాన్ని ఇంకా తూకం చేయలేదని తేలడంతో ఊపిరి పీల్చుకున్నారు. గద్వాల మండల పరిధిలోని కొనుగోలు కేంద్రాల్లో ఇలాంటి దందాలు చాలా వరకు జరుగుతున్నట్లు రైతులు చెబుతున్నారు. ఐకేపీ, మెప్మా, వ్యవసాయ విస్తరణ అధికారులే దీనిని నిలువరించాల్సి అవసరం ఉంది. లేదంటే ప్రభుత్వ ధనం అక్రమార్కుల చేతుల్లోకి పోయే పరిస్థితి ఉందని పలువురు రైతులు అభిప్రాయ పడుతున్నారు.



కొండాపురం ఐకేపీ సెంటర్‌కు తాళం వేసిన రైతులు

కర్ణాటక ధాన్యంపైనే శ్రద్ధ

- ఐకేపీ సెంటర్‌కు తాళం వేసి రైతుల నిరసన

కేటీదొడ్డి : సివిల్ సప్లయ్, ఐకేపీ అధికారులు నిర్లక్ష్యం కారణంగా కర్ణాటక ధాన్యం రాష్ట్రంలోని కొనుగోలు కేంద్రాలకు చేరుతోందని పలువురు రైతుల ఆరోపించారు. శనివారం కొండాపురంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం కార్యాలయానికి తాళం వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కర్ణాటక బార్డర్‌లోని కొండాపురం, వెంకటాపురం, ఈర్లబండ, యర్సన్‌దొడ్డి ఐకేపీ సెంటర్లకు కర్ణాటక నుంచి ధాన్యం వస్తుందని ఆరోపించారు. నిర్వాహకులు కర్ణాటక ధాన్యంపై పెట్టిన శ్రద్ధ తమ ధాన్యం తీసుకోవడంలో చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.



అమ్మ ఆలన... తనయుల పాలన

7

- నేడు మదర్స్ డే..

ఎరువుల అక్రమాలకు చెక్

- » ఈ-పాస్ మిషన్‌తో కచ్చితమైన వివరాలు
- » రైతులకు అధిక సబ్సిడీ అందిస్తున్న కేంద్రం



6

గిరిజనుల జీవితాల్లో వెలుగులు

- సీఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్షించిన ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

మన్ననూర్, మే 10 (ఆంధ్రజ్యోతి) : ఇందిర సౌర జలవికాసం పథకంతో గిరిజనుల జీవితాల్లో వెలుగులు నిండుతాయని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూరు పర్యావరణ విజ్ఞాన కేంద్రంలో 18న సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనకు సంబంధించి సభా ఏర్పాట్లపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం మాచారంలో చెంచులు సాగుచేసే పంట పొలాలను పరిశీలించారు. అక్కడే సభ, పథకం ప్రారంభించే విషయాలపై అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అచ్చంపేట నియోజకవర్గంలోని నల్లమల ప్రాంతం నుంచి ఈ పథకాన్ని ప్రారంభించడం సంతోషదాయకమన్నారు. రూ.12,500 కోట్లతో 6 లక్షల ఎకరాల పోడు భూములకు పథకం వర్తిస్తుందని, రాష్ట్ర వ్యాప్తంగా పోడు వ్యవసాయం చేసే 2.10 లక్షల రైతులకు లబ్ధిచేకూరనుందని తెలిపారు. పోడు భూములు వర్షాధారం ద్వారానే సాగు చేస్తుండడం వలన గిరిజనులు అభివృద్ధికి నోచుకోవడం లేదని, రాష్ట్ర ప్రభుత్వం సౌరశక్తి ద్వారా బోరు బావుల నీటితో పంటలు సాగు చేయించే ప్రక్రియకు శ్రీకారం చుట్టనుందన్నారు. ఉద్యానవనశాఖ అధికారులు రైతులకు కావలసిన పండ్ల మొక్కలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. అధికారులు సమన్వయంతో పని చేసి సీఎం సభ ఏర్పాట్లను పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో మాధవి, డీఎఫ్‌వో, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో రోహిత్ గోపిడి, గ్రౌండ్ వాటర్ ఏడీ దివ్యజ్యోతి, డీటీడీవో ఫిరంగి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారు లు స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



మన్ననూరు పర్యావరణ విజ్ఞాన కేంద్రంలో అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

భక్తిశ్రద్ధలతో గీతా మహాయజ్ఞం

- సిర్సవాడలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు
- నేడు శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీనరసింహుడి కల్యాణం



సిర్సవాడ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గీతా యజ్ఞంలో పాల్గొన్న దంపతులు, భక్తులు

తాడూరు, మే 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సిర్సవాడ గ్రామంలో కొలువుదీరని లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు రెండు రోజులుగా భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. శనివారం స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో యజ్ఞ నిర్వాహకుల ఆధ్వర్యంలో గీతాయజ్ఞాన్ని లోక కల్యాణార్థం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఎదుర్కోళ్ల కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఆదివారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య అత్యంత భక్తిశ్రద్ధలతో జరగనుంది. ఈ బ్రహ్మోత్సవ స్వామి వారి కల్యాణోత్సవానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొనే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మొత్తంగా లక్ష్మీనరసింహస్వామి జాతర మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఆలయ అర్చకులు జగదీశ్వర్, యజ్ఞ నిర్వాహకులు బాల్‌రెడ్డి, కాంతయ్యగౌడ్, మరికొంత మంది నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు



పాలెం వేంకటేశ్వర స్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు చేస్తున్న భక్తులు

బిజినేపల్లి, మే 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాలెంలోని శ్రీఅలర్మేల్ మంగ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో వైశాఖ మాసం శనివారం త్రయోదశి పురస్కరించుకొని భక్తులు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు వైభవంగా నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు కురవి రామానుజచార్యులు తెలిపారు. 28 కుటుంబాలతో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు భక్తిశ్రద్ధలతో చేపట్టినట్లు తెలిపారు. సత్యనారాయణ స్వామి కథ విన్న, పూజించిన విశేష ఫలితం ఉంటుం దన్నారు. భక్తులు సంకల్పించిన కోరికలు నెరవేరుతాయని ప్రతీరోజు సత్యనారాయణ స్వామి వ్రతాలు చేయవచ్చని సూచించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు బాలాజీ అన్నదాన సత్రంలో ఉచిత అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో అర్చకులు జయంత్, చక్రపాణి, మాజీ ధర్మకర్త గాడి సురేందర్, ఆలయ సిబ్బంది బాబయ్య, శివకుమార్, పురుషోత్తం తదితరులు ఉన్నారు.

బీచుపల్లి అంజన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఎర్రవల్లి, మే 10 (ఆంధ్రజ్యోతి) : నడిగడ్డ ఇలవేల్పు దైవమైన బీచుపల్లి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్వామి వారికి పంచామృతాభిషేకం, వాస్తుపూజ, వాస్తు హోమం, అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణం వేద మంత్రోచ్చరణాల మధ్య బ్రహ్మోత్సవాలు ప్రారంభించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మారుతాచారి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఈ నెల 14వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయని, 12న ఆంజనేయస్వామి రథోత్సవం ఉంటుందని సోమవారం నుంచి భక్తులు దాసంగాలు నిర్వహించి, మొక్కులు తీరుకుంటారని ఈవో రామన్‌గౌడ్ తెలిపారు.

నేడు కొండపల్లికి త్రిదండి చినజీయర్ స్వామి రాక

గద్వాల, మే 10 (ఆంధ్రజ్యోతి): గద్వాల మండలంలోని కొండపల్లి గ్రామానికి ఆదివారం త్రిదండి చినజీయర్ స్వామి రానున్నారు. గ్రామంలో కొత్తగా నిర్మించిన రామలింగేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని సందేశం ఇవ్వనున్నారు. గ్రామంలో మూడు రోజుల నుంచి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు వేద పండితులచే నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం గోపూజ, ద్వారతోరణ, ధ్వజకుంభారాధనలు, మూర్తికుంభారాధన, వేదవిన్నపాలు, మూలమంత్రహోమాలు, చతుర్వేదపారాయణ, ప్రబంధ పారాయణలు, కర్మాంగ స్నపణం, పూర్ణాహుతి, నివేదన, హారతి తీర్థ ప్రసాదాలు జరిగాయి. సాయంత్రం విష్ణు సహస్రనామ పారాయణం, కుంభారాధనలు, మూలమంత్ర ఆధివాసాంగ హోమాలు, ధాన్య, ఫల, పుష్ప, శయ్యాధివాసము, పూర్ణాహుతి, నివేదన, హారతి, తీర్థ ప్రసాదాలు అందించారు. ఆదివారం తెల్లవారుజామున నుంచే వేదపారాయణలు, కుంభారాధనలు, ప్రాణ ప్రతిష్ఠాంగ హోమాలు నిర్వహించి స్వాతి నక్షత్రయుక్త వృషభలగ్న సుముహూర్తంలో పార్వతీ పరమేశ్వరులు, సీతారామాంజనేయ స్వామి, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ హోమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం త్రిదండి చినజీయర్ స్వామిచే ప్రవచన కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు తెలిపారు.

రైతులను ఇబ్బందులకు గురి చేయడం సరికాదు



ధర్నా చేస్తున్న రైతులు

గోపాల్‌పేట, మే 10(ఆంధ్రజ్యోతి) : పంట పండించిన రైతులను కొనుగోలు చేయ కుండా ఇబ్బందులకు గురి చేయడం సరికాదని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహాల ఎదుట హైదరాబాద్ వనపర్తి ప్రధాన రహదారిపై రైతులతో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రైతును ఇబ్బంది పెట్టిన ప్రభుత్వం మనగలిగిన చరిత్ర లేదని, ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పై మొండి వైఖరి వీడాలని డిమాండ్ చేశారు. లారీలు తెప్పించి వెంటనే కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం బస్తాలను తీసుకువెళ్లి మిగిలిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అన్నారు. సుమారు గంట పాటు రాస్తారోకో చేయడంతో వాహనాలు నిలిచిపోయాయి. అక్కడికి పోలీసులు, సివిల్ సప్లయ్ జిల్లా అధికారి విశ్వ నాథం రైతులతో మాట్లాడి శాంతింపజేశారు. జిల్లా సివిల్ సప్లయ్ అధికారులు విశ్వనాథ్ మాట్లాడుతూ... తక్షణమే నాలుగు లారీలను మండల కేంద్రానికి ధాన్యం తీసుకెళ్లేందుకు పంపుతున్నట్లు తెలిపారు. దీంతో రైతులు రాస్తారోకో విరమించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొల్లెద్దుల బాలరాజు, శ్రీనివాసులు, చంద్రశేఖర్, గోపాల్, కాశీం, మన్యం నాయక్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎరువుల దుర్వినియోగానికి అడ్డుకట్ట

- ఈ-పాస్ మిషన్‌తో కచ్చితమైన వివరాలు
- రైతులకు అధిక సబ్సిడీ అందిస్తున్న కేంద్రం

పాలమూరు, మే 10 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం రైతులకు ఎరువులను అధిక సబ్సిడీతో అందజేస్తోంది. పాత మిషన్‌తో రైతుల నుంచి కచ్చితమైన వివరాలు నమోదు కాకపోవడంతో రైతులు కానివారు సైతం ఎరువులు తీసుకెళ్తున్నారు. దీంతో రైతులకు మేలు చేయాలని చేపట్టిన సబ్సిడీతో ఎరువుల పంపిణీ లక్ష్యం దెబ్బతింటోంది. రైతులకు మేలు చేయడంతో పాటు ఎరువుల దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయాలని ఎల్-1 స్కానర్‌తో కూడిన పీవోఎస్ అండ్రాయిడ్ స్మార్ట్ డివైసులు, ఈ-పాస్ మిషన్‌ను ఉచితంగా పంపిణీ చేయాలని నిర్ణయించింది. కేంద్రం స హకారంతో సుమారు 20-25 ఎరువుల కంపెనీలు 50 నుంచి 90 శాతం వరకు సబ్సిడీని అందజేస్తున్నాయి. పాత మిషన్‌తో సిగ్నల్ లేక రైతుల వివరాలు సరిగ్గా నమోదయ్యేది కాదు. ఆ కారణంతో ఎరువులు పక్కదారి పట్టేవి. రైతులు కానివారు ఎరువు లు అధికంగా తీసుకెళ్లి తోళ్ల పరిశ్రమలు, తోళ్లను శుభ్రం చేయటం, ఇతర వాటికి వాడేవారు. దానికి అడ్డుకట్ట వే యటానికే కేంద్రం ఈ-పాస్ మిషన్‌ను అందుబాటు లోకి తీసుకొచ్చింది. రైతులకు అందజేసే ఎరువులు ఈ-పాస్ మిషన్‌లో నమోదు చేసుకుని ఇవ్వటంతో కచ్చితమైన వివరాలు నమోదు చేయవచ్చు.



ఎరువుల గోదాంను పరిశీలిస్తున్న జిల్లా అధికారులు



కొత్త ఈ-పాస్ మిషన్

ఎరువుల నమోదు తప్పనిసరి..

మహబూబ్‌నగర్ జిల్లాలోని రైతులు ఎరువులు ఎంత తీసుకున్నది నమోదు చేయటం తప్పనిసరి. జిల్లాలో ఎంత మంది రైతులున్నారు.. ఒక్కో రైతుకు ఎన్ని ఎకరాల భూమి ఉంది.. ఆందులో తరి, చెలక భూమి ఎంతెంత ఉన్నది. ఏ పొలానికి ఎరువులు ఏ మోతాదులో వాడుతున్నారో నమోదు చేయించాలి. దీంతో అక్రమార్కులు సబ్సిడీ ఎరువులు దుర్వినియోగం కావటానికి ఆస్కారం ఉండదు. నూతన సాంకేతిక పరిజ్ఞానంతో ఎల్-1 స్కానర్ పీవోఎస్ అండ్రాయిడ్ స్మార్ట్ డివైసులు పనిచేస్తాయి. ఫర్టిలైజర్ డీలర్లు ఎరువులు అమ్మేటప్పుడు ఆండ్రాయిడ్ స్మార్ట్ డివైసులకు సిగ్నల్ అందటం లేదనే సమస్య ఉండదు. ఒక్క రైతుకు ఎంత మోతాదులో ఎరువులు అవసరమో అంతే స్థాయిలో ఎరువులు విక్రయించాలి. రైతుల వివరాలు నమోదు చేయకుండా డీలర్లు, వ్యాపారులు ఎట్టిపరిస్థితుల్లో ఎరువులను అమ్మటానికి వీల్లేదని అధికారులు తెగేసి చెప్పారు. ఎరువుల నిల్వలు, అమ్మకాలను ఎప్పటికప్పుడు ఈ-పాస్ మిషన్‌లో నమోదు చేయటం అనివార్యం.

పీవోఎస్ ఆండ్రాయిడ్ డివైసుతో ఉపయోగం..



ఎల్-1 స్కానర్ పీవోఎస్ అండ్రాయిడ్ స్మార్ట్ డివైసులు, ఈ-పాస్ మిషన్‌తో రైతుల వివరాలు నమోదు చేయగలం. సిగ్నల్ సమస్య ఉండదు. ఎరువులు దుర్వినియోగం కావటానికి అవకాశం ఉండదు. ఫర్టిలైజర్ డీలర్లు మిషన్‌లో రైతుల వివరాలు నమోదు చేయకుండా ఎరువులు అమ్మరాదు. ఒక్కరే ఎక్కువ ఎరువులు తీసుకోరాదు. డీలర్లు బాధ్యతగా అధికారుల సూచన మేరకు పొలానికి అవసరమైన మేరకు ఎరువులు ఇవ్వాలి.

- బి.వెంకటేష్, జిల్లా వ్యవసాయాధికారి

సౌర విద్యుత్ పనులను పూర్తి చేయాలి

వంగూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని కొండారెడ్డిపల్లిలో మరికొద్ది రోజుల్లోనే సౌర వెలుగులు విరజిమ్మనున్నాయని ప్రిన్సిపల్ సెక్రటరీ ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ సందీప్‌కుమార్ సుల్తానీయ అన్నారు.

శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వగ్రామ మైన కొండారెడ్డిపల్లిని టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషరఫ్ ఆలీఫారుక్‌తో కలిసి ఆయన సందర్శించారు. గ్రామంలో జరుగుతున్న సోలార్ విద్యుత్ పనులు, గ్రామస్థుల ఇళ్లపైన అమర్చిన సోలార్ పలకను పరిశీ లించారు. పనులను త్వరత గతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో సౌరవిద్యుత్‌ను పెం చేల ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని ఆయన తెలిపారు. ప్రతీ ఇంటిపైన రూఫ్‌టాప్ సౌరవిద్యుత్‌ను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్టు కింద కొండారెడ్డిపల్లిని ఎంపిక చేయడం జరిగిందని, గ్రామంలో 100 శాతం ఇళ్లు, భవనాలు, ఇతర విద్యుత్ కనెక్షన్‌ల అన్నిటికి సౌర విద్యుత్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ సంక్షేమ కమిషన్ సభ్యుడు కేవీఎన్‌రెడ్డి, తహసీల్దార్ మురళీమోహన్, ఎస్ఈ పాల్ రాజ్, ఏఈ మేఘనాథ్, మాజీ ఉప సర్పంచ్ వేమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సౌరవిద్యుత్ పలకలను పరిశీలిస్తున్న సీఎండీ ప్రిన్సిపల్ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానీయ

రోగులు ఫుల్.. వసతులు నిల్

- మెడిసిన్ సరఫరా లేక రోగుల ఇబ్బంది
- తూతూమంత్రంగా హాస్పిటల్ నిర్వహణ
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువు



కోస్గి ప్రభుత్వ ఆసుపత్రి

మందులు బయటకు రాయడం లేదు..

ఆసుపత్రిలో మందులు బయటకు రాయడం లేదు. స్థానిక సూపరింటెండెంట్ అనుదీప్‌తో మాట్లాడండి అంటూ జిల్లా సూప రింటెండెంట్ మల్లికార్జున్ నిర్లక్ష్యంగా సమాధానమి చ్చారు. స్థానిక సూపరింటెండెంట్ అనుదీప్ అందుబాటులోకి రాలేదు.

- జిల్లా సూపరింటెండెంట్ మల్లికార్జున్

కోస్గి, మే 10 (ఆంధ్రజ్యోతి): కోస్గి ప్ర భుత్వ ఆసుపత్రికి రోగులు బారులు తీరుతున్నారు తప్ప అక్కడ వసతులు మాత్రం ఎక్కడా కన్పించడం లేదు. గత ప్రభుత్వ నిర్లక్ష్యమా అంటూ ఆసుపత్రి నిర్మాణమే ఆరు సంవత్సరాలకు పూర్తయి ఎన్నికల ముందు హడావుడిగా ప్రారంభించారు. ఆసుపత్రిలో సిబ్బంది కొరత, దానికితోడు మందులు సరఫరా కాక రోగులు ఇబ్బంది పడుతున్నారు. పైరవీలతో సిబ్బం దిని నియమించినా వారు సరిగా పనిచేయడం లేదు. ఏ మందులు అడిగినా తమవద్ద లేవని బయట తీసుకొని రావాలని చీటీ రాసి ఇస్తున్నారు వైద్యులు. పేరుకు 100 పడకల ఆసుపత్రిగా మారుస్తామం టున్నారు తప్ప ఇంకా మారడం లేదు. ఆసుపత్రిలో కనీస వసతులు, సరైన సౌకర్యాలు లేవు. ప్రసవానికి మహిళలు వస్తే విధుల్లో ఉన్న డాక్టర్లు నర్సుల తో డెలివరీలు చేస్తున్నారు. ఆసుపత్రి వైపు జిల్లా అధికారులు కన్నెత్తి కూడా చూడటం లేదు. ఈ తతంగం చూస్తుంటే ఈ ఆసుపత్రిని నామమా త్రంగానే నడుపుతున్నారు. మండల కేం ద్రంలోని ఈ ఆసుపత్రి పరిస్థితి ఇలా ఉంటే పీహెచ్‌సీల పరిస్థితి మరింత దయనీయంగా మారింది.

ఎండలతో అల్లాడుతున్న జనం

వనపర్తి/నారాయణపేట/గద్వాల, మే 10 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహ బూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా ఎండ తీవ్రత కొనసాగుతోంది. శనివారం వనప ర్తి జిల్లా గోపాల్‌పేట మండలంలో 39.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైం ది. అత్యల్పంగా వీపనగండ్ల మండలంలో 26.2 డిగ్రీలు నమోదైంది. జోగు ళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో 39.8 డిగ్రీలు నమోదు కాగా ఇటిక్యాల, గట్టు, కేటీదొడిలలో 39.6, అయిజలో 39.4, ఆలంపూర్, మల్దకల్, ధరూర్‌లలో 39.2 డిగ్రీలు నమోదైంది. కనిష్ఠగా 25 డిగ్రీలు నమోదైంది. మహబూబ్‌నగర్ జిల్లాలో గరిష్ఠం 39, కనిష్ఠం 27.6 డిగ్రీలు, నాగర్‌కర్నూల్ జిల్లాలో గరిష్ఠం 38 డిగ్రీలు, కనిష్ఠం 26 డిగ్రీలు, నారాయణపేట జిల్లాలో గరిష్ఠం 36 డిగ్రీలు, కనిష్ఠం 27 డిగ్రీలు నమోదైంది.

ఇద్దరి దుర్మరణం

- వాహనాన్ని మరమ్మతు చేస్తున్న క్రమంలో ప్రమాదం



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ రామకృష్ణ

భూత్పూర్, మే 10 (ఆంధ్రజ్యోతి); బ్రేక్ ఫెయిలై ఆగిపోయిన ప్రైవేటు బస్సును మరమ్మతు కోసం తీసుకొని వస్తుండగా అదుపు తప్పి అదే బస్సు ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందారు. ఈ సంఘటన శనివారం తెల్లవారుజామున 44వ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. ఎస్ఐ చంద్రశేఖర్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కడప జిల్లాలోని వీరంపల్లి గ్రామం, బుద్వేలు మండలానికి చెందిన అనకర్ల ప్రవీణ్‌కుమార్ (43) అనే వ్యక్తి అదే జిల్లాకు చెందిన శివదర్శిని ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో క్లీనర్‌గా పని చేస్తున్నాడు. అయితే కడప నుంచి హైదరాబాదుకు శుక్రవారం సాయంత్రం ట్రావెల్ బస్సు ప్రయాణికులతో బయలు దేరింది. ఈ తరుణంలో భూత్పూర్ సమీపంలోకి రాగానే అంబడిపల్లి గ్రామ స్టేజీ దగ్గర బస్సు బ్రేకులు ఫేయిల్ అయి ఆగిపోయింది. ఇదే ట్రావెల్స్‌లో బస్సు డ్రైవర్‌గా పని చేస్తున్న కడప జిల్లాకు చెందిన శ్రీహర్ష అనే వ్యక్తి తన భార్య సిరిగిరి వీరమణికి ఫోన్ చేసి బస్సును మరమత్తుకు తీసుకెళ్లమని చెప్పాడు. ఈమె మహబూబ్‌నగర్ జిల్లా, భూత్పూర్ మండలంలోని పోతులమడుగు గ్రామంలో నివాసం ఉంటుంది. భర్త ఫోన్ చేసి చెప్పడంతో అదే గ్రామంలో శివగౌడ్ అనే యువకుడితో కలిసి ఒక ట్రాక్టర్‌ను తీసుకొని ఆగిపోయి ఉన్న బస్సును కట్టుకొని బస్సు క్లీనర్ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి మరమ్మతు చేయించడానికి తీసుకెళ్తున్నది. ఈ క్రమంలో బస్సు స్టార్ట్ అయ్యి దూసుకురావడం వల్ల క్లీనర్ ప్రవీణ్‌కుమార్ (43), సిరిగిరి వీరమణి(38) బస్సు కింద పడి అక్కడికక్కడే మృతి చెందారు. క్లీనర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరమణికి భర్త, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. విషయం తెలుసుకున్న భూత్పూర్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ చంద్రశేఖర్ సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. బస్సు క్లీనర్ అన్న అనకర్ల ప్రశాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి తలించినట్లుగా ఎస్ఐ పేర్కొన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

బాలానగర్, మే 10 (ఆంధ్రజ్యోతి) : చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం బోడ జానంపేటలో శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన మేకల వెంకటయ్య (42) శుక్రవారం తన వ్యవసాయ పొలానికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. వెంకటయ్య భార్య చిట్టెమ్మ, కుమారుడు కార్తీక్ బంధువులతో కలిసి వెంకటయ్య కోసం వెతికారు. ఈ క్రమంలో వ్యవసాయ భూమి సమీపంలో మైసమ్మ చెరువు వద్ద వెంకటయ్యకు సంబంధించిన మోటర్‌సైకిల్, చెప్పులు, బట్టలు కనిపించాయి. అనుమానంతో చెరువులో బంధువులతో కలిసి వెతకగా వెంకటయ్య మృతదేహం కనిపించింది. మృతుడి భార్య చిట్టెమ్మ ఫిర్యాదు మేరకు ఎస్ఐ లెనిన్ కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

డిప్యుటేషన్ల పర్వం

(5వ పేజీ తరువాయి)

వేశారు. మళ్లీ నాగర్‌కర్నూల్‌లో ఫార్మసిస్టుల కొరత ఉందని పాలమూరు ఆసుపత్రి నుంచి మరో ముగ్గురిని షిఫ్టుల వారిగా డిప్యూటేషన్ వేశారు. తాజాగా వనపర్తి జిల్లాలోని జనరల్ ఆసుపత్రి గైనకాలజిస్టుల కొరత ఉందని, పాలమూరు ఆసుపత్రిలో పనిచేసే ముగ్గురు అసిస్టెంట్ ప్రొఫెసర్లను డిప్యూటేషన్ వేయాలని డీఎంఈ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. దీంతో ఆ డాక్టర్లు అయోమయంలో పడ్డారు.



ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు మొరపెట్టుకుంటున్న డాక్టర్లు

సూపరింటెండెంట్‌తో మొర...

ప్రస్తుతం డిప్యుటేషన్‌పై వేసిన ముగ్గురు డాక్టర్లు వనపర్తికి వెళ్లాలంటే తమకు కొన్ని ఇబ్బందులు ఉన్నాయని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంపత్‌కు మార్ సింగ్‌తో శుక్రవారం మొరపెట్టుకున్నారు. అందులో ఒకరి తండ్రి అనారోగ్య స్థితిలో ఉన్నారు. మరో ఇద్దరి పరిస్థితి కూడా అంతే ఉంది. వారి తల్లిదండ్రులు కూడా అనారోగ్య స్థితిలో ఉండటంతో పాటు చిన్నపిల్లలు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై డిప్యూ టేషన్‌పై పునరాలోచించాలని డాక్టర్లు, వారి తల్లిదం డ్రులు సూపరింటెండెంట్‌కు వినతిపత్రం సమర్పించారు. ఇదిలా ఉండగా ఈ ముగ్గురు అసిస్టెంట్ డాక్టర్లపై పనిభారం తీవ్రంగా ఉంది.

గైనిక్ విభాగా ధిపతి సైతం తరచూ సెలవులపై వెళ్లడం, మిగతా డాక్టర్లు సైతం హైదరాబాద్ నుంచి వచ్చేవాళ్లు కావడంతో వారు కూడా ఇష్టం వచ్చినపుడు రావడం, పోవడంతో ఈ అసిస్టెంట్‌లపై భారం పడుతుంది. అంతేకాకుండా ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు ఇదే ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారు. అందువల్ల తమను డిప్యుటేషన్‌పై పంపించొద్దని మొరపెట్టుకుంటున్నారు.

గట్టిగా మాట్లాడలేకపోతున్నారు...

ప్రతీసారి ఎక్కడ సిబ్బంది తక్కువైతే అక్కడికి పాలమూరు జనరల్ ఆసుపత్రి నుంచి సిబ్బందిని డిప్యూటేషన్‌పై పంపించాలని ఆదేశాలు ఇస్తున్నా ఇక్కడి డైరెక్టర్, సూపరింటెండెంట్, ప్రజాప్రతినిధులు గట్టిగా మాట్లాడలేకపోతున్నారు. ఉమ్మడి జిల్లాల నుంచి జనరల్ ఆసుపత్రి రోగులు వస్తున్నారు. ప్రతీ నెల 800 నుంచి 900 వరకు డెలివరీలు అవుతున్నాయి. ఇప్పటికే పోస్టులు కూడా లేక, సిబ్బంది కొరతతో నానా అవస్థలు పడుతూ రోగులకు వైద్యసేవలు అందిస్తున్నారు. వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల నుంచి 28 మంది స్పెషాలిటీ డాక్టర్లను డిప్యూటేషన్‌పై పాలమూరు జనరల్ ఆసుపత్రికి పంపించాలని జీవో కూడా జారీ చేశారు. దాన్ని అమలు చేయకుండా సేవలు తక్కువగా ఉండే చోట్లకు డిప్యూటేషన్ వేయాలని రాష్ట్ర ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేస్తున్నారు. కానీ ఏ ఒక్కరు కూడా మాట్లాడడం లేదు. ఇది ఇలాగే కొనసాగితే పాలమూరు జనరల్ ఆసుపత్రి పూర్తిగా ఖాళీ అయ్యి రోగులకు సేవలందక ఇబ్బందులు పడే పరిస్థితి ఎదురయ్యే ప్రమాదం లేకపోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

తాత్కాలిక సర్దుబాటు కోసమే డిప్యూటేషన్లు...

ప్రభుత్వం ఆయా ఆసుపత్రుల్లో సిబ్బంది లేకపోవడం వలన తాత్కాలికంగా సర్దుబాటు చేసేందుకు డిప్యూటేషన్లు వేయాలని ఉత్తర్వులు జారీ చేస్తోంది. త్వరలో నోటిఫికేషన్లు వేసి ఖాళీల కొరతను తీర్చాలనే ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. తమ వద్ద కూడా సిబ్బంది లేక ఇబ్బందులు చాలానే ఉన్నాయి. కాని ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను అమలు చేయాల్సిన బాధ్యత మాపై ఉంది. ఏదైనా సమస్యలు ఉంటే వినతిపత్రం ఇవ్వాలని, దాన్ని ప్రభుత్వానికి పంపిస్తామని చెప్పాము.

- డాక్టర్ సంపత్‌కుమార్ సింగ్, జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్

ప్రత్యామ్నాయ మార్గాలున్నప్పటికీ....

వనపర్తి జనరల్ ఆసుపత్రిలో ఇప్పటికే ఇద్దరు ప్రొఫెసర్లు, ముగ్గురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సివిల్ సర్జన్, సివిల్ అసిస్టెంట్ సర్జన్‌లతో పాటు ఇద్దరు ఎస్వీఎస్ ఆసుపత్రి నుంచి తీసుకున్న పీజీ డాక్టర్లు, ఇద్దరు ఎస్ఆర్ డాక్టర్లు ఉన్నారు. అయితే అక్కడ పనిచేసే సీనియర్ డాక్టర్ల వేధింపులు ఎక్కువ కావడంతో కొంతమంది లాంగ్ లీవ్‌పై, మరికొంత మంది ఉద్యోగానికి రాజీనామా చేసి వెళ్లారు. ప్రస్తుతం అక్కడ ఐదుగురు గైనిక్ డాక్టర్లు ఉన్నారు. అయినప్పటికీ మహబూబ్‌నగర్ నుంచి ముగ్గురిని డిప్యుటేషన్ వేయడంలో అంతర్యం ఏమిటో అర్థం కావడం లేదు. అంతేకాకుండా కాంట్రాక్టు పద్ధతిన నోటిఫికేషన్ వేసి డాక్టర్లను నియమించుకునేందుకు, సీహెచ్‌సీలో ఉన్న గైనిక్ డాక్టర్లను కూడా డిప్యుటేషన్‌పై తీసుకునే ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నా వాటిపై చర్యలు తీసుకోవడం లేదు.

నేడు మదర్స్ డే..

అమ్మ ఆలన.. తనయుల పాలన

అమ్మంటే ఎవరికి మాత్రం ఇష్టం ఉండదు.. కనిపెంచి తన సర్వస్వాన్ని పిల్లల కోసం త్యాగం చేసే తల్లి ఎప్పటికీ పూజ్యనీయురాలే... పిల్లలపై చూపే మమకారం, పిల్లల అభిరుచులను ఎరిగి ఉన్నతంగా తీర్చిదిద్దే తల్లుల స్ఫూర్తి మరింత ఉన్నతం... అలాంటి తల్లులు తీర్చిదిద్దిన తనయుల గాథలు ఇవి. మే నెలలోని రెండో ఆదివారం జరుపుకునే మదర్స్ డే సందర్భంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, ఎస్పీలను 'ఆంధ్రజ్యోతి' పలకరించింది. వారి ఎదుగుదలలో వారి మాతృమూర్తుల ప్రోత్సాహం, స్ఫూర్తి వారి మాటల్లోనే...

-ఆంధ్రజ్యోతి, భూత్పూర్/ జడ్చర్ల/ నాగర్‌కర్నూల్/ అలంపూరుచౌరస్తా/ గద్వాల న్యూటౌన్/ గద్వాల క్రైం/ వనపర్తి



అమ్మతో వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

అమ్మ స్ఫూర్తి ఎనలేనిది.

అమ్మ స్ఫూర్తితో ప్రజలు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించడానికి సివిల్ సర్వీసెస్‌ను ఎంచుకున్నా అమ్మానాన్న ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులు, నాన్న సత్తయ్య తహసీల్దార్ నుంచి అంచెలంచెలుగా ఎదిగి కామారెడ్డి అడిషనల్ కలెక్టర్‌గా ఉద్యోగ విరమణ పొందారు. అమ్మ నరసమ్మ ఐఆర్ఎస్ ఆఫీసర్, ఇన్‌కం టాక్స్ విభాగంలో పని చేస్తూ ఇటీవలే పదవీ విరమణ పొందారు. నేను ఐఏఎస్ కావడం వెనకాల అమ్మ స్ఫూర్తి ఎంతో ఉన్నది. ఈ స్థాయికి రావడానికి వారి నుంచి ఎంతో నేర్చుకున్న. తల్లిదండ్రుల ను గౌరవించడం ప్రతీ ఒక్కరి బాధ్యత, జన్మనిచ్చిన తల్లిదండ్రులు దేవుళ్లతో సమానం.

- ఆదర్శ్ సురభి, వనపర్తి కలెక్టర్



అమ్మ చేదోడువాదోడు వల్లే స్థిరపడ్డాం

తల్లి లాలన, తండ్రి పోషణతోనే మా కుటుంబం ఎదిగింది. మాది సాధారణ కుటుంబం. నాన్న కిరాణం కొట్టు నడుపుతూ నలుగురు సంతానాన్ని పెంచి పోషిస్తుండగా తల్లి శోభ రఘునాథ్ ప్రతీ అంశంలో చేదోడువాదోడుగా ఉంటూ కుటుంబ ఉన్నతికి దోహదపడ్డారు. నాన్న కష్టాన్ని అర్థం చేసుకొని తాను కష్టపడుతూ పేదరికంలో ఉన్న మా కుటుంబాన్ని ఉన్నత స్థాయిలోకి తీసుకొచ్చేందుకు అహర్నిషలు పనిచేశారు. ఆమె వల్లే అక్క డాక్టర్‌గా విదేశాల్లో స్థిరపడ్డారు. మిగతా ఇద్దరు తమ్ముళ్లు సాఫ్ట్‌వేర్, మెకానికల్ ఇంజనీర్లుగా స్థిరపడ్డారు.

- గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, నాగర్‌కర్నూల్ ఎస్పీ



ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డికి రాజకీయంగా పలు సూచనలు ఇస్తున్న ఆయన తల్లి బండ్ల రేవతమ్మ.

మనసెరిగి ప్రోత్సహించిన అమ్మ...

నా ఎదుగుదలలో ఎల్లప్పుడు అండగా ఉంటూ, ఎమ్మెల్యేగా పోటీచేసేలా అమ్మ కృషి చేశారు. నాకు చిన్నప్పటి నుంచి రాజకీయం అంటే ఉత్సాహం ఉండటంతో అమ్మ నా మనస్సును అర్థం చేసుకొని నన్ను రాజకీయ విషయాలను విపులంగా వివరించేవారు. అడుగడుగునా అడ్డంకులుంటాయనే విషయాలను వెల్లడిస్తూనే మరోవైపు ప్రజల మనస్సులో శాశ్వతంగా నిలబడేలా కృషి చేసిన వారే నిజమైన రాజకీయ నాయకుడు అని ఉత్సాహం కల్గించారు. అమ్మ సూచనల మేరకు ప్రజాపాలనే నా లక్ష్యం. ఇప్పటికి కూడా పలు రాజకీయ అంశాల విశ్లేషణపై అమ్మతో చర్చిస్తా...

- బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, గద్వాల ఎమ్మెల్యే

అమ్మే తొలిగురువు..



తల్లితో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

అమ్మే తొలిగురువు.. ఎలా చదువుతున్నావు... స్కూల్‌లో పాఠాలు అర్థం అవుతున్నాయా? మాస్టార్లు బాగా నేర్పిస్తున్నారా అని ప్రతీ రోజు అడిగేవారు. దగ్గర కూర్చోబెట్టుకొని చిన్నచిన్న పదాలు పలికిస్తూ నేర్పించేవారు. నేను, తమ్ముడు, ఇరుగుపొరుగు వారందరం కలిసి పాఠశాల సెలవుల్లో వ్యవసాయ బావుల వద్దకు వెళ్లే వాళ్లం. సరదాగా బావుల్లో ఈత కొట్టడానికి, పండ్లు తినడానికి పొలాల్లో చాలా తిరిగేవాళ్లం అపుడు మా కోసం అమ్మ చాలా వెతికేది. ఆ రోజులు గుర్తు చేసుకుంటే అబ్బా ఎంత సంతోషమో....

- జీ మధుసూదన్‌రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే



నా చదువు కోసం అమ్మ నగలు అమ్మారు

నా విజయం వెనుక అమ్మ త్యాగం ఎంతో ఉన్నది. గ్రూప్స్ కోచింగ్ తీసుకునేటప్పుడు అమ్మ నగలు అమ్మింది. నా తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివించడం వల్లే ఈ స్థాయిలో ఉన్నా. కనీసం మా అమ్మ సినిమాకు వెళ్లిన సందర్భం కూడా లేదు. ఆమె ఆనందాలను పక్కన పెట్టి మమ్మల్ని ప్రయోజకులుగా తీర్చిదిద్దారు. అందుకే అమ్మ ఆశయాలకు అనుగుణంగా చదివి ఈ స్థాయిలోకి వచ్చినందుకు అమ్మ ఎంతో సంతోషించారు.

- జానకి, మహబూబ్‌నగర్ ఎస్పీ



అమ్మ నళినితో గద్వాల కలెక్టర్ బీఎం సంతోష్

అమ్మ ప్రోత్సాహంతోనే కలెక్టర్‌నయ్యా

నా తల్లి ప్రోత్సాహంతో కలెక్టర్‌గా ఉన్నాను. నేను కలెక్టర్ కావడానికి మూడు సార్లు సివిల్ పరీక్షలు రాశాను. రెండు సార్లు ఫలితం దక్కకపోవడంతో నిరుత్సాహపడుతున్న సమయంలో అమ్మ నళిని వెన్నంటి ప్రోత్సాహించారు. నా ఎదుగుదలకు అహర్నిశలు కృషి చేవారు. నిరుత్సాహ పడకుండా పట్టుదలతో చదివేలా ప్రోత్సహించారు. ఆమ్మ నన్ను కలెక్టర్‌గా చూడాలన్న ఉద్దేశంతో ఇంకా పట్టుదలతో చదివి అమ్మ ఆశయాన్ని సాధించాను.

- బీఎం సంతోష్, గద్వాల కలెక్టర్

నా ప్రతీ విజయంలో అమ్మ విశేష కృషి



తల్లితో జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

అమ్మ స్వతంత్రంగా ఉండటం నేర్పారు. నేను ఎమ్మెల్యేగా గెలవడంలో అమ్మ కృషి విశేషంగా ఉన్నది. నియోజకవర్గంలోని ప్రతీ గ్రామానికి వెళ్లి, ప్రజలకు మేలు చేసేందుకే తన కొడుకు రాజకీయాల్లోకి వచ్చాడని, అవకాశం ఇస్తే, మంచి చేస్తాడంటూ ప్రజలకు వివరించారు. పేదలకు సహాయం చేయాలనే ఆలోచనను పెంపొందించారు. సర్పంచ్‌గా గెలిచి ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూనే, నన్ను కూడా అలా ఉండేలా ప్రోత్సాహం అందించి, ఇప్పటికీ ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. ప్రజలకు అందుబాటులో ఉండేందుకే సర్పంచ్‌గా ఉన్నప్పుడే హైదరాబాద్‌కు రమ్మన్నా మా స్వగ్రామం రంగారెడ్డిగూడలోనే ఉన్నారు.

- జనంపల్లి అనిరుధ్‌రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే

ఆమ్మ ప్రోత్సాహంతోనే గ్రూప్-1 సాధించా



తల్లి వెంకట సుబ్బమ్మతో గద్వాల ఎస్పీ శ్రీనివాసరావు

కష్టపడి చదివే తత్వం చిన్నప్పటి నుంచి ఆమ్మ వెంకట సుబ్బమ్మ నేర్పించడంతోనే గ్రూప్-1 సాధించి జిల్లా ఎస్పీ స్థాయిలో ఉన్నా.. నాకు చిన్నప్పటి నుంచి పోలీస్ అధికారి అంటే ఎంతో ఇష్టం. నా ఇష్టాన్ని గమనించిన నా తల్లి కష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తామని ఎల్లవేళలా ప్రోత్సహించారు. ఆమె ప్రోత్సాహం వల్లే మొదట గ్రూప్-1 అధికారిగా నియమితుడినయ్యా. 2013లో ఐపీఎస్‌గా ప్రమోషన్ పొంది సీఐడీలో విధులు నిర్వహించాను. ఇప్పటికీ నాకు ఏ సమస్య వచ్చినా అమ్మతో మాట్లాడితే ఆ సంతోషంలో సమస్య మాయంఅవుతుంది. అమ్మ చెప్పే విషయాలు అందరు పాటిస్తే ప్రతీ ఒక్కరు ఉన్నతంగా రాణిస్తారు.

- శ్రీనివాసరావు, జిల్లా ఎస్పీ, జోగుళాంబ గద్వాల

అమ్మ ఆశీస్సులే శ్రీరామరక్ష



తల్లి సవారమ్మతో అలంపూరు ఎమ్మెల్యే విజయుడు

అమ్మ ఆశీస్సుల వల్లే ఇంతవాణ్ణి అయ్యాను. చిన్నప్పుడు అమ్మనాన్నలు కూలీ పని చేసి ఏడుగురు సంతానాన్ని సాకారు. వారి రెక్కల కష్టం వల్లె మేము ఇంతవాళ్లము అయ్యాం. కడుపు కాల్చుకొని నన్ను ఇంతవాణ్ణి చేసిన అమ్మ ప్రేమ వెల కట్టలేనిది. ఈ సృష్టిలో అమ్మ పంచే ప్రేమ ముందు అన్నీ చిన్నవే. ప్రతీ రోజు అమ్మతో మాట్లాడకపోతే ఏదో తెలియని వెలితి. అమ్మను మించిన దైవం లేదు.

- విజయుడు, ఎమ్మెల్యే అలంపూర్

నా ఎదుగుదలను చూడలేకపోయారు.



తల్లి వెంకటమ్మతో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

మాది ఖిల్లాఘణపురం మండలం సల్కెలాపూర్. అమ్మ పేరు వెంకటమ్మ, మా చిన్నతనంలోనే సల్కెలాపూర్ నుంచి మా అమ్మ కుటుంబాన్ని అమ్మమ్మ ఊరైన పెద్దమందడి మండలం మంగంపల్లికి తీసుకొని వచ్చారు. ఆ నిర్ణయమే మా జీవితంలో కీలక మలుపు. ఆ రోజు ఇక్కడికి రావడం వల్ల కొంత వృద్ధిలోకి వచ్చాం. ఇంటి బాధ్యతలను అమ్మే ఎక్కువగా భరించేది. అప్పుడప్పుడు కోప్పడినా ఏ రోజూ చేయి చేసుకోలేదు. అమ్మ బాధ్యతలను నేను 12వ సంవత్సరం నుంచే తీసుకున్నాను. మేం వృద్ధిలోకి వచ్చే సమయంలో ఆమె మా నుంచి దూరమయ్యారు. మా ఎదుగుదలను చూడలేకపోయారు. నా ఇద్దరు కొడుకులతో మాట్లాడుకుంటూ వారి చేతుల్లోనే చనిపోయారు.

- తూడి మేఘారెడ్డి, ఎమ్మెల్యే వనపర్తి

అమ్మ ప్రోత్సాహంతో అనుకున్న లక్ష్యం వైపు...



అమ్మ అంటేనే సృష్టికి మూలం.. ఆమె కృషి, పట్టుదల, ప్రోత్సాహంతోనే నేను ఈ స్థాయిలో ఉన్నా.. నేను ఏ నిర్ణయం తీసుకున్నా పూర్తి మద్దతుగా నిలిచారు. తెలంగాణ కోసం ఉద్యోగాన్ని వదిలిపెట్టిన, తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నా, ఎన్ని కష్టాలు వచ్చినా లక్ష్యం దిశగా అడుగులు వేయాలని వెన్నంటే ఉండి ప్రోత్సహించారు. నచ్చిన లక్ష్యం కోసం పోరాడితే అంతిమంగా ఫలితం వస్తుందని ప్రోత్సాహం అందించారు.

- యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే మహబూబ్‌నగర్

760 గ్రాముల గంజాయి పట్టివేత

» వివరాలు వెల్లడించిన జడ్చర్ల ఎక్సైజ్ సీఐ విప్లవ్‌రెడ్డి



నిందితులతో జడ్చర్ల ఎక్సైజ్ సీఐ విప్లవ్‌రెడ్డి

జడ్చర్ల, మే 10 (ఆంధ్రజ్యోతి) : విక్రయానికి సిద్ధంగా ఉన్న 760 గ్రాముల గంజాయిని మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం మోతీ ఘనపూర్‌లో జడ్చర్ల ఎక్సైజ్‌శాఖ అధికారులు పట్టుకున్నారు. జడ్చర్లలోని ఎక్సైజ్ కార్యాలయంలో శనివారం ఎక్సైజ్ సీఐ విప్లవ్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. రాజస్థాన్ రాష్ట్రం నాగౌర్ జిల్లా ముండ్వా తాలూకారూన్ గ్రామానికి చెందిన ధన్‌రాజ్, బిర్జూసింగ్ బాలానగర్ మండలం మోతీఘన పూర్‌లో ఓ ఇంటిని కిరాయికి తీసుకుని నివాసం ఉంటున్నారు. ధనరాజ్ కిరాణం దుకాణం నిర్వహిస్తున్నాడు. హైదరాబాద్‌లోని ధూల్‌పేటలో కిలో గంజాయిని బిర్జూసింగ్ రూ.20 వేలకు కొనుగోలు చేసి, కొంత లాభంతో ధన్‌రాజ్‌కు విక్రయించేవాడు. ఆ గంజాయిని 4 గ్రాముల చొప్పున ప్యాకెట్‌లుగా తయారు చేసి, ఒక్కో ప్యాకెట్‌ను రూ.300కు గంజాయి తాగే వారికి ధన్‌రాజ్ డోర్‌డెలవరీ చేస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు శనివారం ఉదయం మోతీఘనపూర్‌కు వెళ్లి దాడులు నిర్వహించగా, బిర్జూ సింగ్ వద్ద 700 గ్రాములు, ధన్‌రాజ్ వద్ద 60 గ్రాములు (4గ్రాముల ప్యా కెట్) గంజాయిని పట్టుకున్నట్లు తెలిపారు. మోతీఘనపూర్ ప్రాంతంలో నాలుగేళ్లుగా నివాసం ఉంటున్న వీరు ఇటీవలే గంజాయి వ్యాపారం ప్రారంభించారు. నిందితులను అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న సుమారు రూ.లక్ష విలువగల 760 గ్రాముల గంజాయితో పాటు ద్విచక్రవా హనం, మూడు సెల్‌ఫోన్‌లను సీజ్ చేసినట్లు వివరించారు. ఎక్సైజ్ ఎస్ఐ నాగరాజు, హెడ్‌కానిస్టేబుల్ నథానియేల్, మురళీ, కానిస్టేబుల్ సిద్దార్ధ్, జ్యోతి ఉన్నారు.

విద్యాసామర్థ్యం పెంపు కోసం శిక్షణ

- 13న జిల్లా స్థాయిలో స్కూల్ అసిస్టెంట్, మండల స్థాయి డీఆర్పీలకు
- 19 నుంచి మండల స్థాయిలో ఎస్‌జీటీలకు శిక్షణ
- శిక్షణ ఏర్పాట్లపై డీఆర్పీలతో సమీక్షించిన ఉమ్మడి జిల్లా శిక్షణ ఇన్‌చార్జి మొరాజుల్లా ఖాన్, డీఈవో ప్రవీణ్‌కుమార్



డీఆర్పీలతో మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మొరజుల్లాఖాన్, డీఈవో ప్రవీణ్‌కుమార్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం మే 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలను పెంపొందించాలన్న లక్ష్యంతో పాఠశాల విద్యాశాఖ ఉపాధ్యాయులకు శిక్షణ ఏర్పాటు చేస్తోంది. వేసవి సెలవుల్లో విడతల వారిగా అన్ని కేటగిరిల ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు, అకాడమిక్ మానిటరింగ్ అధికారులు ఆధ్వర్యంలో శిక్షణకు సంబంధించి అన్నీ ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపే లక్ష్యంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 3227 ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న 12,854 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర స్థాయిలో ఇప్పటికే స్కూల్ అసిస్టెంట్స్ రాష్ట్ర స్థాయి ఆర్పీలుగా శిక్షణ పొందారు.

వీరు డీఆర్పీలకు శిక్షణ కూడా ఇచ్చారు. మండల స్థాయిలో ఎస్‌జీటీలకు శిక్షణ ఇచ్చే ఆర్పీలకు ఐదు రోజులు పాటు శిక్షణ ఇవ్వనున్నారు. అదేవిధంగా స్కూల్ అసిస్టెంట్ శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకు సంబంధించి ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, వనపర్తి, జోగుళాంబ గద్వాల, నారాయణపేట, నాగర్‌కర్నూల్ జిల్లాల విద్యాశాఖ అధికారులు ఈ నెలలోనే పూర్తి చేయనున్నారు.

13 నుంచి జిల్లా స్థాయిలో శిక్షణ

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని భగీరథ కాలనీలో గల జేపీ ఎన్ఈఎస్ కళాశాలలో ఐదు రోజుల పాటు శిక్షణ సాగనుంది. 13న మొదటి విడతలో స్కూల్ అసింటెంట్ ఆంగ్లం, సాంఘిక శాస్త్రం, గణితం సబ్జెక్టులతోపాటు, మండల స్థాయిలో ఎస్‌జీటీలకు శిక్షణ ఇచ్చే డీఆర్పీలకు కూడా శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకు సంబంధించి శనివారం డీఆర్‌పీలతో ఉమ్మడి జిల్లా శిక్షణ ఇన్‌చార్జి, మహబూబ్‌నగర్ డైట్ ప్రిన్సిపాల్ మొరాజుల్లా ఖాన్, మహబూబ్‌నగర్ డీఈవో ప్రవీణ్‌కుమార్‌లు పలు అంశాలపై చర్చించారు .

ఉమ్మడి జిల్లాలోని ఉపాధ్యాయుల వివరాలు..

ఉమ్మడి మహబూబ్‌నగర్ ప్రభుత్వ, లోకల్ బాడీ కేజీబీవీ మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు మహబూబ్‌నగర్ జిల్లాలో 3950 మంది, నాగర్‌కర్నూల్‌లో 3,735 మంది, వనపర్తి జిల్లాలో 2225 మంది, నారాయణపేట జిల్లాలో 2132 మంది , జోగుళాంబ గద్వాల జిల్లాలో 2,534 మంది ఉన్నారు.

న్యూస్ బాక్స్

బాధితుడికి ఎల్‌వోసీ అందజేత

కొత్తకోట, మే 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన లారీ డ్రైవర్ మహ్మద్ హబీబ్ అనారోగ్యంతో హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న హబీబ్ పరిస్థితిని మండల పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యులు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. వెంటనే స్పందించిన సీఎం కార్యాలయ అధికారులతో మాట్లాడి రూ.లక్ష మంజూరు చేయించి ఎల్‌వోసీ పత్రాన్ని స్వయంగా అందజేశారు. ఎమ్మెల్యే వెంట ప్రశాంత్, కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, బాదంవెంకటేశ్వర్లు, మోహన్‌రెడ్డి, సుభాష్, ముజీబ్, తయ్యబ్ తదితరులు ఉన్నారు.

హమాలీలకు ఆర్థిక సాయం

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, మే 10 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి పట్టణంలో నిర్వహించే కోట మైసమ్మ పండుగ కోసం గంజ్ బజార్ హమాలీలకు మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి ఆర్థిక సహకారం అందించారు. శనివారం రూ.15 వేల నగదును బీఆర్ఎస్ నాయకులు నందిమల్ల అశోక్ ద్వారా హమాలీలకు అందజేశారు. బజారు హమాలీ సంఘం అధ్యక్షుడు ఆడమ్ చంద్రయ్య, విష్ణు, శివ, లక్ష్మయ్య, రాజు, రాములు, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారెడ్డి పరామర్శ

గోపాల్‌పేట, మే 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మున్ననూరుకి చెందిన లక్ష్మి అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా.చిన్నారెడ్డి లక్ష్మిని పరామర్శించారు.

బీఆర్ఎస్ నాయకులు..

చిన్నంబావి, మే 10(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వెలగొండలో ఉదయం ఆకస్మికంగా మృతిచెందిన స్వాములు కుటుంబానికి కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి ఆదేశానుసారం గ్రామ బీఆర్ఎస్ పార్టీ నాయకుడు శరత్ రెడ్డి ఆధ్వర్యంలో కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం కుటుంబానికి మనోధైర్యమిచ్చి రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

ధాన్యం భద్రపరిచేందుకు గోదాం పరిశీలన

పాన్‌గల్, మే 10(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలులో వేగం పెంచి రైతుల ఇబ్బందులు తొలగించడానికి శనివారం వనపర్తి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్ కాంగ్రెస్ నాయకులు కేతేపల్లి రవి, వెంకటేష్ నాయుడు లతో కలిసి మండల కేంద్రంలోని గోదాంను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం నేరుగా గోదాంకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పుల్లారావు, జయరాములు సాగర్, సింధూ వాల్మీకి నాయుడు, నరేందర్ గౌడ్, ఇలియాస్, పులేందర్, దర్గయ్య, జూపల్లి యువసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థ సభ్యుల సాయం

శ్రీరంగాపురం, మే 10 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన బోరెల్లి రంగస్వామి టీబీ వ్యాధితో బాధపడుతూ రెండు నెలల క్రితం మృతిచెందాడు. కుటుంబ పెద్ద చనిపోవడంతో ఆ కుటుంబానికి పెద్ద దిక్కు లేకుండా పోయింది. దీంతో కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ యువజన సంఘం కేశపాగ రాజేష్ విజ్ఞప్తి మేరకు గద్వాల పట్టణానికి చెందిన సోషల్ వెల్ఫేర్ స్వచ్ఛంద సంస్థ వారు బోరెల్లి రంగస్వామి కుటుంబానికి అండగా నిలిచారు. బాధిత కుటుంబానికి కావాల్సిన రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు, రూ.15 వేలు ఆర్థిక సాయం అందించారు. నాగేష్, రాము, అంబేద్కర్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికుడికి సన్మానం

వనపర్తి టౌన్, మే 10 (ఆంధ్రజ్యోతి) : హజ్ యాత్రకు వెళ్తున్న యువకుడిని ముస్లీ మైనారిటీ నాయకులు ఘనంగా సన్మానించారు. పట్టణానికి చెందిన సయ్యద్ అబ్రార్ త్వరలోనే ముస్లిం పవిత్ర యాత్ర హజ్‌కు వెళ్తున్న సందర్భంగా శనివారం ముస్లిం మైనారిటీ నాయకులు శాలువా, పూలమాలతో సన్మానించారు. దేవుడు సయ్యద్ అబ్రార్ యాత్ర ప్రయాణాన్ని సులభతరం చేసి, దేశ ప్రజలందరూ సుభిక్షంగా ఉండేలా చూడాలని ప్రార్థించారు. గులాం ఖాదర్ ఖాన్, సయ్యద్ అక్తర్, అనీస్ తదితరులు ఉన్నారు.

ఉరి వేసుకొని మహిళ ఆత్మహత్య

గోపాల్‌పేట, మే 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఉరి వేసుకొని ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన పిల్లి కండ్ల శ్యామలమ్మ(45) మండల కేంద్రంలో నివాసం ఉంటూ కూరగాయలు అమ్ముకుంటూ జీవనం కొనసాగిస్తుంది. ఆమె భర్త చెన్నయ్య కొన్నాళ్ల క్రితం మృతి చెందాడు. ఆమెకు ముగ్గురు కుమార్తెలకు వివాహాలు జరుగగా.. కుమారుడు వనపర్తిలో నివాసం ఉంటున్నాడు. శనివారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించింది. చుట్టు పక్కల వారు గమనించి కుటుంబ సభ్యులకు తెలుపగా వచ్చి చూసేసరికి శ్యామలమ్మ ఉరికి వేలాడుతూ కనిపించింది. కుటుంబ సభ్యులు ఆమెను అక్కడి నుంచి వనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందిందని వైద్యులు తెలియజేశారు.

కొన్ని రోజులుగా శ్యామలమ్మ మతిస్థిమితం ఉండటం లేదన్నారు.

ప్రాథమిక పాఠశాలలకు నోటు పుస్తకాలు

- జిల్లా వ్యాప్తంగా దాదాపు 15,000 మంది విద్యార్థులకు ప్రయోజనం
- రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

వనపర్తి విద్యా విభాగం, మే 10 (ఆంధ్రజ్యోతి) : రానున్న 2025-26 విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలలో చదివే 1-5 తరగతి విద్యార్థులకు కూడా నోటు పుస్తకాలను అందజేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటి వరకు ప్రభుత్వ పాఠశాలలో చదివే 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు మాత్రమే ఈ నోటు పుస్తకాలు పంపిణీ చేసేవారు. ఇక నుంచి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సైతం నోటు పుస్తకాలు పంపిణీ చేయాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఒకటి, రెండు చదువుతున్న విద్యార్థులకు 3, 3 నుంచి 5వ తరగతి చదువుతున్న విద్యార్థులకు 4 నోటు పుస్తకాలను అందజేయనున్నట్లు ఆదేశాలు అందాయని జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఇది వరకే ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వర్క్ బుక్‌లను ఉచితంగా ఇచ్చే వారు. వీటికి అదనంగా ప్రస్తుతం నోటు పుస్తకాలను అందజేయనున్నారు. మే 15 తరువాత నోటు పుస్తకాలు జిల్లా కేంద్రానికి రానున్నాయి. జిల్లాకు చేరిన వెంటనే ఆయా ప్రభుత్వ పాఠశాలకు పంపించి సకాలంలో విద్యార్థులకు అందజేస్తామని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

15వేల మందికి ప్రయోజనం

వనపర్తి జిల్లాలో 358 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 14,486 మంది విద్యార్థులు చదువుతు న్నారు. ఈ పేదింటి విద్యార్థులందరికీ ఈ విద్యా సంవత్సరం నుంచి ఉచితంగా వర్క్ బుక్‌లతో పాటు నోటు పుస్తకాలు అందనున్నాయి.



విద్యార్థులకు పంపిణీ చేయనున్న నోటు పుస్తకాలు

విద్యార్థుల సంఖ్య పెంచాలి



ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తుంది. ఇందులో భాగంగానే 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేస్తుంది. ఇప్పటి నుంచి ప్రతి శుక్రవారం పాఠశాలలో తల్లిదండ్రులతో సమావేశం నిర్వహిస్తాం. అదే విధంగా జిల్లాలో జూన్ 6 నుంచి బడిబాట కార్యక్రమం నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేస్తాం.

- అబ్దుల్ ఘని, జిల్లా విద్యాశాఖ అధికారి

ప్రతీ గింజను కొనుగోలు చేస్తాం



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జి.వెంకటేశ్వర్లు

వీపనగండ్ల, మే 10, (ఆంధ్రజ్యోతి) : రైతు పండించిన ప్రతీ గింజను కొంటామని అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.వెంకటేశ్వర్లు రైతులకు భరోసా ఇచ్చారు. శనివారం మండల పరిధిలోని తూముకుంట, కల్వరాల, చిన్నంబాయి మండలంలోని వెలగొండ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతులెవరూ అధైర్య పడవద్దని, వారం రోజుల్లో ప్రతీ ధాన్యపు గింజలను కొనుగోలు చేస్తామని తెలిపారు. తాలు, గడ్డి, మట్టి లేకుండా నిబంధనల ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని అన్నారు. ధాన్యం తరలింపులో ఇబ్బందులు కలుగకుండా ప్రతీ కేంద్రానికి ఒక లారీని పెట్టాలని, ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు కల్పించాలని తెలిపారు.

ధాన్యం కొనుగోలు చేయాలని రాస్తారోకో



రాస్తారోకోలో పాల్గొన్న రైతులు

చిన్నంబావి, మే 10 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వెలగొండలో నెల రోజుల నుంచి రైతుల ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రోడ్డుపై బైఠాయించి రైతులు నిరసన వ్యక్తం చేసి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అంజనేయులు, మాజీ ఎంపీపీ సోమేశ్వరమ్మ ఈ ధర్నాకు మద్దతు తెలిపారు. ఎస్‌ఐ ధర్నా వద్దకు చేరుకుని వారితో మాట్లాడటంతో ధర్నా విరమించారు.

రైతుల కోసం బీఆర్ఎస్ రాస్తారోకో

శ్రీరంగాపూర్ : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందని రైతులు హరిగోస పడుతున్నా పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఉమ్మడి మండలంలోని జానంపేట, వెంకటాపురం, నాగసానిపల్లి, పాతపల్లి, గుమ్మడం, తిప్పాయిపల్లి, అయ్యావారిపల్లి వివిధ గ్రామాల రైతులు మాట్లాడుతూ... కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కాంట చేసి, నాలుగైదు రోజులు గడుస్తున్నా... లారీలు లేక వడ్లు మిల్లులకు పంపించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చివరికి తూకం అయిన వడ్లు తరుగు వస్తుంది, మేము దించుకోమని మిల్లర్లు రైతులను బెదిరించి క్వింటాల్‌కు 4, 5 కిలోలు తగ్గిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీరంగాపురం సింగిల్‌విండో చైర్మన్ జగన్నాథం నాయుడు, రాధాకృష్ణ, వడ్డె రమేష్, పర్వతాలు, అర్జున్, శివ పాల్గొన్నారు.



సురేంద్రపురి ఎక్స్‌రోడ్డులో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, రైతులు

'ప్రతిపక్షాల ఉచ్చులో పడొద్దు'

శ్రీరంగాపురం, మే 10(ఆంధ్రజ్యోతి) : కొంతమంది బీఆర్ఎస్ నాయకుల స్వలాభం కోసం రైతులను రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని, అలాంటి వారిని ఎక్కడ కూడా పట్టించుకోవద్దని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ అన్నారు. శనివారం శ్రీరంగాపురం మండల కేంద్రం పరిధిలోని వెంకటాపూర్ ఎక్స్ రోడ్డు వద్ద కొంతమంది రైతులను మాయమాటలు చెప్పి బీఆర్ఎస్ నాయకులు ధర్నా చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి అని అన్నారు. గత బీఆర్ఎస్ పాలనతో పోల్చుకుంటే సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ఏర్పాటుకు రైతాంగం ఆశీర్వాదం ఎంతో ఉందని అన్నారు.

వీర జవానుకు మునిసిపల్ కార్మికుల నివాళి



వనపర్తిలో నివాళి అర్పిస్తున్న మునిసిపల్ కార్మికులు

వనపర్తి టౌన్, మే 10 (ఆంధ్రజ్యోతి) : దేశ సరిహద్దులో జరుగుతున్న యుద్ధంలో వీర మరణం పొందిన తెలుగుబిడ్డ మురళి నాయక్‌కు వనపర్తి మునిసిపల్ కార్మికులు నివాళి అర్పించారు. రెండు రోజుల కిందట పాకిస్థాన్ చేసిన దాడిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జవాన్ మురళి నాయక్ అమరుడైన సందర్భంగా శనివారం వనపర్తి మునిసిపల్ పారిశుధ్య కార్మికులు ఘనంగా నివాళి అర్పించి మౌనం పాటించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడారు. దేశ రక్షణ కోసం తమ ప్రాణాలను అర్పిస్తున్న దేశ సైనికులకు యావత్తు భారతావని అండగా నిలవాలన్నారు. సైనికుల త్యాగాలు వెలకట్టలేనివని, ప్రభుత్వాలు సైనికుల కుటుంబాలకు అన్ని విధాలుగా తోడుగా ఉండాలన్నారు. మునిసిపల్ జవాన్ కృష్ణ, డ్రైవర్ యాదగిరి, మునిసిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

త్రివిధ దళాలకు మద్దతుగా..

కొత్తకోట : పట్టణంలో త్రివిధ దళాలకు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. పెబ్బేరు రోడ్డు విశ్వేశ్వర్ పెట్రోల్ బంక్ నుంచి ప్రారంభమైన ర్యాలీ అంబా భవాని ఆలయం వరకు, అక్కడి నుంచి మదనాపురం రోడ్డు, అక్కడి నుంచి వనపర్తి రోడ్డు బీపీఆర్ గార్డెన్ వరకు చేపట్టి చౌరస్తాకు చేరుకొని మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా జై జవాన్ నినాదాలతో మార్మోగింది. భారతమాత రక్షణలో ప్రాణాలు కోల్పోయిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సత్యసాయి జిల్లా మురళీ నాయక్‌కు సంతాప సూచికంగా మౌనం పాటించారు. ర్యాలీలో వందేమాతరం, ఆరోగ్య, సన్‌రైజ్, జై భారత్, ఛత్రపతి వాకింగ్ క్లబ్‌ల శిక్షకులు దేవన్న, శేఖర్‌గౌడ్, రాములు యాదవ్, కిషన్ నాయక్ పాల్గొన్నారు.



కొత్తకోటలో బైక్ ర్యాలీ

భూ తగాదాలో గాయపరిచిన వ్యక్తులకు రిమాండ్

ఖిల్లాఘణపురం, మే 10(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కర్నె తండాలో గత నెల 23న భూముల హద్దుల విషయంలో జరిగిన తగాదాలో కొడావత్ కిషన్ కుటుంబ సభ్యులపై దాడి చేసి గాయపరిచిన నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి శనివారం కోర్టులో జడ్జి ముందు హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ సురేష్ గౌడ్ తెలిపారు. కర్నె తండా శివారు ప్రాంతంలోని సర్వే నెంబర్ 71 భూమి హద్దుల విషయంలో జరిగిన ఘర్షణలో కొడావత్ కిషన్ కుటుంబ సభ్యులపై దాడి చేసి గాయపరిచిన ఇస్లావత్ శ్రీను, ఇస్లావత్ విజయ్, ఇస్లావత్ రవి, ఇస్లావత్ రవిని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

విద్యార్థికి ఘన సన్మానం



రాకేష్‌ను సన్మానిస్తున్న నాయకులు

వనపర్తి రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పెద్దగూడెంకి చెందిన విద్యార్థి రాకేష్ ప్రభుత్వ హాస్టల్‌లో చదివి పది పరీక్షల్లో 555 మార్కులు సాధించి గ్రామ టాపర్‌గా నిలిచాడు. దీంతో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మాణిక్యం, మాజీ సర్పంచ్ కొండన్న విద్యార్థి ఇంటికి వెళ్లి శనివారం శాలువాతో సత్కరించారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి



ఉపాధి కూలీల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ప్రసాద్

ఆత్మకూరు, మే 10(ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ నెల 20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెలో వ్యవసాయ కార్మికుల ఉపాధి కూలీలు అత్యధికంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మండల పరిధిలోని జూరాలలో శనివారం ఉపాధి హామీ కూలీలను కలుసుకొని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

అమరచింత, మే 10 (ఆంధ్రజ్యోతి) : యుద్ధ నేపథ్యంలో సోషల్ మీడియా, ఫేస్‌బుక్, ట్విట్టర్ వాడే ఖాతాదారులు ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తే ఊరుకోబోమని ఎస్‌ఐ సురేష్ పేర్కొన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. భారత్ - పాక్ యుద్ధం నేపథ్యంలో అనవసరపు పోస్టులు, ఆధారాలు లేని సమాచారం, రెచ్చగొట్టే సన్నివేశాలు ఎట్టి పరిస్థితుల్లో పోస్టు చేయరాదని సూచించారు. ప్రభుత్వ నియమ నిబంధనలకు అనుగుణంగా ఖాతాదారులు నడుచుకోవాలని ఆదేశించారు. పొరపాట్లు జరిగితే.. సంబంధిత వ్యక్తితో పాటు గ్రూప్ అడ్మిన్‌లపై కూడా బాధ్యత ఉంటుందని సూచించారు.

హమాలీలకు తీవ్ర గాయాలు

పాన్‌గల్, మే 10 (ఆంధ్రజ్యోతి) : హమాలీలకు తీవ్ర గాయాలైన సంఘటన పాన్‌గల్ మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. మండల కేంద్రంలోని ఐకేపీ కొనుగోలు సెంటర్‌లో కాంట చేసిన ధాన్యపు బస్తాలను హమాలీలు లారీల్లో లోడ్ చేశారు. లారీలో ఓవర్ లోడ్ కావడంతో ధాన్యపు బస్తాలు ఒక్కసారిగా ఒరిగి కింద పడ్డాయి. ప్రమాదవశాత్తు కింద పడుతున్న వరి ధాన్యపు బస్తాల నుంచి తప్పించుకోబోయిన ముగ్గురు హమాలీ కూలీలపైన పడ్డాయి. ఈ ప్రమాదంలో హమాలీ కూలీలు తెలుగు రాములుకు కాలు విరిగింది. మరో ఇద్దరికి యాదగిరి గొల్ల రాములుకు స్వల్ప గాయాలయ్యాయి. అతనిని కుటుంబ సభ్యులు జిల్లా ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా... ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించినట్లు వారు తెలిపారు. ప్రభుత్వపరంగా తమను ఆదుకోవాలని హమాలీ కూలీ తెలుగు రాములు భార్య రాములమ్మ ఆవేదన వ్యక్తం చేసింది.

కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక యూనియన్ నాయకులు

వనపర్తి టౌన్, మే 10 (ఆంధ్రజ్యోతి) : కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట అంజనేయులు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో సీఐటీయూ, ఏఐటీయూసీ, టీయూసీఐ, ఎల్‌ఐసీ ఐసీఈయూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. పాలిటెక్నిక్ నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ పట్టణంలోని పలు వీధులు, కాలనీల వెంట సాగి రాజీవ్ చౌరస్తాకు చేరుకుంది. అనంతరం రాజీవ్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వందేళ్ల పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి యాజమాన్యాలకు, పెట్టుబడిదారులకు మేలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిందన్నారు. 20న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికవర్గం పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మోష, గణేష్, రాజు, రమేష్, మదన్, రాములు, సునిత, బాలస్వామి, రత్నయ్య, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో పాల్గొన్న ఫొటోగ్రాఫర్లు

ఆత్మకూరు, మే 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఫొటోగ్రాఫర్ల సమస్యలను పరిష్కరించాలని ఆత్మకూరు ఫొటోగ్రాఫర్ల సంఘం అధ్యక్షుడు మన్యం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆత్మకూర్ పట్టణ కేంద్రంలో కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న రాజీవ్ యువ వికాసం పథకంలో ఫొటోగ్రాఫర్ల కు రూ.10 లక్షల సబ్సిడీ రుణం అందించాలని, అలాగే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో ప్రత్యేక అవకాశం కల్పించి ఇల్లు మంజూరు చేయాలని కోరారు. శ్రీనివాసులు, తౌఫిక్, వెంకటరాములు, శ్రీరాములు, రాజశేఖర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే

పాన్‌గల్, మే 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల వద్ద వరి ధాన్యాన్ని నిబంధనల పేరిట రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. తరుగు పేరుతో ఒక సంచికి కిలో తరుగు తీస్తున్నారని, తరుగు తీయకుండా కొనుగోలు చేసి వెంటనే ధాన్యాన్ని తరలించాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండేవి కాదని, కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని అన్నారు. తక్షణమే జిల్లా అధికార యంత్రాంగం స్పందించి కేంద్రాలోని ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని, లేకుంటే రైతులను సమీకరించి ఆందోళన కార్యక్రమం చేపడతానని హెచ్చరించారు. శ్రీధర్ రెడ్డి, చంద్రశేఖర్ నాయక్, వెంకటయ్య నాయుడు, జ్యోతినందన్ రెడ్డి, వీరసాగర్, నరసింహ, సరోజమ్మ పాల్గొన్నారు.

బాలిక అనుమానాస్పద మృతి

కొత్తకోట, మే 10 (ఆంధ్రజ్యోతి) : బాలిక అనుమానాస్పదంగా మృతిచెందిన సంఘటన కొత్తకోటలో శనివారం చోటుచేసుకుంది. మృతురాలి బంధువులు, కుటుంబ సభ్యులు తెలిపిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. పాన్‌గల్ మండల మల్లాయపల్లికి చెందిన బాలచంద్రమ్మ, లక్ష్మయ్య దంపతుల కుమార్తె భారతి. ఆమెను పన్నెండేళ్ల కిందట పెబ్బేరు మండల గుమ్మడంకి చెందిన వెంకటేష్‌కి ఇచ్చి వివాహం చేశారు. వీరికి ప్రశాంతి(11), గణేష్(8) జన్మించారు. మల్లాయపల్లికి చెందిన సాయిబాబు పాత పరిచయంతో భారతిని లొంగదీసుకుని పిల్లలతో సహా కొత్తకోటకు తీసుకొచ్చి కాపురం పెట్టాడు. గుమ్మడం వెంకటేష్ మల్లాయపల్లిలో పంచాయతీ పెట్టి భారతి కుటుంబ సభ్యులు, పెద్దలతో విడాకుల పత్రం పొందాడు. కొత్తకోటలో కాపురం ఉంటున్న భారతి, సాయిబాబులకు పాప జన్మించింది. అక్కడి నుంచి ప్రశాంతి, గణేష్‌లకు కష్టాలు మొదలయ్యాయి. శనివారం ప్రశాంతి ఇంట్లో ఉరివేసుకుని కనిపించింది. ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడం, ప్రశాంతి పెళ్లీడుకు రావడంతో తట్టుకోలేని సాయిబాబు, భారతి కలిసి హత్య చేసి, ఉరి వేశారని తాతయ్య, నాయనమ్మలు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టాల్సిన పోలీసులు హత్య చేయడం మీరు చూశారా? అని ఎదురు ప్రశ్న వేశారని బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఎస్‌ఐ ఆనంద్‌ను వివరణ కోరగా... ఎవరిని దూషించలేదని, ఫిర్యాదు తీసుకొని కేసు నమోదు చేశామని చెప్పారు. ప్రశాంతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

ఇంట్లో చోరీ

రేవల్లి, మే 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగపూర్‌లో బాలకృష్ణచారి అనే వ్యక్తి ఇంట్లో శనివారం ఉదయం 7 గంటల సమయంలో చోరీ జరిగింది. ఎస్‌ఐ రజిత తెలిపిన వివరాల ప్రకారం బాలకృష్ణచారి నాగపూర్‌లో తన పాత ఇంట్లో బావి మోటార్ ఉంచాడు. తెల్లవారు జామున చూసిన మోటార్ ఉదయం 8 గంటల సమయంలో కనిపించలేదు. దీంతో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఓ మహిళ నాగపూర్‌లో బావి మోటార్ తీసుకొని వెళ్తుండగా గ్రామస్థులు పట్టుకున్నారు. అదే మహిళపై బాలకృష్ణచారి ఫిర్యాదు చేశాడని, వారి వెనుక పెద్ద ముఠా ఉన్నట్లు ఆరోపిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అప్‌గ్రేడ్‌తోనే సరిపెడుతున్నారా?



మాట్లాడుతున్న రాచాల యుగంధర్‌గౌడ్

వనపర్తి వైద్యవిభాగం, మే 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని అప్‌గ్రేడ్‌లతోనే సరిపెడితే ఎలా? అని బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ రాచాల యుగంధ ర్‌గౌడ్ ప్రశ్నించారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆయన సందర్శించి, రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలు, వైద్యుల కొరత, వైద్య సిబ్బంది కొరతను ఆర్ఎంవో డాక్టర్ జావేద్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొదటగా ఏరియా ఆసుపత్రిగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని కాలక్రమేనా అప్‌గ్రేడ్ చేస్తు నేడు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిగా మార్చడం, అందులోనూ మెడికల్ కళాశాల మంజూరై టీచింగ్ ఆసుపత్రిగా కొనసాగుతుందని అన్నారు. అప్‌గ్రేడ్‌తోనే సరిపెడుతున్న ప్రభుత్వం అందుకు అనుగుణంగా వైద్యులను, వైద్య సిబ్బందిని నియమించకపోవడంతో రోగులకు, రోగుల సహాయకులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. నాయకులు దేవర శివ, అంజన్న యాదవ్, ధర్మేంద్ర సాగర్, రాఘవేందర్, రామన్‌గౌడ్, గిరిధర్ పాల్గొన్నారు.

ఉమ్మడి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం



కంచిరావుపల్లిలో కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్పీ రావుల గిరిధర్

పెబ్బేరు రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను ఎస్పీ రావుల గిరిధర్ శనివారం వనపర్తి జిల్లా, పెబ్బేరు మండలంలోని కంచిరావుపల్లిలో ప్రారంభించారు. చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో ఎస్పీకి పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎస్పీని సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపు, ఓటములు సమానంగా స్వీకరించాలని క్రీడాకారులకు సూచించారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా మానసిక వికాసం, మనోధైర్యం, దేహదారుఢ్యం పెంచుకోవచ్చన్నారు. ఆటల్లో ప్రతిభ కనబరిచిన, తన క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. ఎస్‌ఐ యుగేంధర్‌రెడ్డి, ఆలయ ధర్మకర్త వెంకటేశ్వర్‌రెడ్డి, తేజవర్ధన్, గోపాల్, నీలవరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, కృష్ణయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.